1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | డిసెంబర్ 20, 2023 | www.navatelangana.com

జాతీయ స్థాయి అత్యపత్య క్రీడలకు విద్యార్థి ఎంపిక

ఆసిఫాబాద్: జాతీయస్థాయి అత్యపత్య క్రీడలకు జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బొమ్మన సాయివర్ధన్ ఎంపికైనట్లు అత్యపత్య క్రీడల కమిటీ జిల్లా అధ్యక్షుడు కట్కర్ భీంరావ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థిని కమిటీ తరఫున అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి ఎంపిక ట్రయల్స్‌లో విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు ఈ నెల 26న పుదుచ్చేరిలో నిర్వహిస్తారన్నారు. జిల్లాకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికవ్వడం సంతోషంగా ఉందని, మరింత మంది విద్యార్థులు ఎంపికయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థిని కమిటీ జిల్లా కార్యదర్శి బొమ్మకంటి కిరణ్‌కుమార్, సెయింట్ మేరీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కెవి మారి, కరస్పాండెంట్ ఝాన్సీ, ఉపాధ్యాయురాలు శైలజ, పిఈటీలు అర్చన కుమారి, రాకేష్ అభినందించారు.



గణిత ప్రతిభ పరీక్ష

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పరీక్షలో మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ ఎ. కిషన్ గ్రాహం, ప్రధానోపాధ్యాయులు ఆర్. నరేష్, మండల కన్వీనర్లు బి.రాజేశ్వర్, గొల్లపెల్లి రమేశ్ పాల్గొన్నారు.



అన్నదాతకు ఆధార్ అవస్థలు..!

- మార్కెట్‌లో ఇష్టారీతిన అనుసంధాన ప్రక్రియ
- ఏ అకౌంట్‌లో పడుతున్నాయో తెలియక అయోమయం
- ఖాతాలు కలిగిన బ్యాంకుల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- సమస్య పరిష్కరించాలని రైతు సంఘం నేతల వినతి


క్యూలో నిలబడ్డ రైతులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన పంట పత్తి. ప్రతి ఏటా లక్షల క్వింటాళ్లలో కొనుగోళ్లు జరుగుతుంటాయి. పత్తి పంటకు పెట్టింది పేరుగా మారింది. ఇలాంటి మార్కెట్‌లో కొందరు అధికారులు, సిబ్బంది అలసత్వం కారణంగా పంట విక్రయించిన రైతులు అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధన తీసుకొచ్చింది. కొందరు దళారులు బయటి ప్రాంతాల్లో పత్తిని కొనుగోలు చేసి మార్కెట్‌లో రైతుల పేరిట విక్రయిస్తుంటారు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడంతో పాటు రైతు మాత్రమే పంటను విక్రయించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆధార్ నిబంధన తీసుకొచ్చిందని తెలిసింది. ప్రతి రైతు పత్తి అమ్మకాలకు వచ్చిన సందర్భంలో వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించింది. కేవలం పట్టా కలిగిన రైతులు మాత్రమే కచ్చితంగా రావాలని స్పష్టం చేశారు. దీంతో అనేక మంది వృద్ధులు, మహిళలు మార్కెట్‌కు వచ్చి గంటల తరబడి వరుసలో నిలబడి ఉంటున్నారు. పత్తిని విక్రయించాలంటే ఆధార్ అనుసంధానం చేయించుకోవడం తప్పనిసరి కావడంతో రైతులు మార్కెట్‌కు వస్తున్నారు. కానీ కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

అంతా అయోమయం..!

పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలంటే తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకురావాలని అధికారులు సూచించారు. కేవలం ఆధార్ మాత్రమే తీసుకురావాలని చెప్పడంతో రైతులు ఆ కార్డులతో మార్కెట్‌కు వస్తున్నారు. వాస్తవానికి ఒక్కో రైతు వివిధ ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో ఖాతాలు కలిగి ఉంటారు. ఒక్కో రైతు పేరిట మూడు నుంచి నాలుగు వరకు ఖాతాలు ఉండటం సహజంగా మారింది. తాజాగా మార్కెట్‌కు పత్తిని తీసుకొచ్చిన రైతుల ఆధార్‌లను సేకరిస్తున్న అక్కడి సిబ్బంది రైతుల ఖాతాలకు అనుసంధానం చేస్తున్నారు. వారు చెప్పిన ఖాతాకు కాకుండా వారి ఇష్టం వచ్చిన ఖాతాకు అనుసంధానం చేస్తుండటంతో రైతులు తీవ్ర సమస్యను ఎదుర్కొంటున్నారు. పత్తి అమ్మిన పైసలు ఏ బ్యాంకు ఖాతాలో పడ్డాయో తెలియక అయోమయానికి గురవుతున్నారు. అసలు డబ్బులు పడుతున్నాయా లేదా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పత్తి అమ్మిన రైతులు వారి బ్యాంకు ఖాతాలు కలిగిన వివిధ బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.

> **మార్కెట్‌లో దళారుల బెడదను నిర్మూలించడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం అన్నదాతలకు చిక్కులు తెచ్చి పెడుతోంది. మార్కెట్‌కు పంట తీసుకొచ్చిన ప్రతి రైతులు వారి బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం ఉండాలని స్పష్టం చేసింది. కానీ మార్కెట్‌లో సిబ్బంది ఇష్టారీతిన అనుసంధాన ప్రక్రియ చేపట్టడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పంట అమ్మకం తర్వాత ఏ ఖాతాలో డబ్బులు పడ్డాయో తెలియక తికమక పడాల్సి వస్తోంది. దీంతో పంట డబ్బులు తీసుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మరోపక్క కొన్ని బ్యాంకులు రైతుల ఖాతాల్లో జమ అయిన పంట డబ్బులను పాత రుణం కింద జమ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా అనేక మంది రైతులు ఆధార్ అనుసంధాన ప్రక్రియతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అధికార యంత్రాంగం ఈ సమస్యను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని కోరుతున్నారు.**

ఏ బ్యాంకులో పడ్డాయో తెలియడం లేదు : భూమారెడ్డి, సుందరగిరి, జైనథ్ మండలం



నాకు వివిధ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. కానీ తొలి నుంచి పత్తి అమ్మకానికి సంబంధించి ఎస్‌బీఐ ఖాతా నెంబర్ ఇచ్చాను. మొదటి నుంచి అదే బ్యాంకులో డబ్బులు పడేవి. కానీ ఇటీవల బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం కోసం నెంబర్ ఇచ్చాను. మార్కెట్ సిబ్బంది ఏ ఖాతాకు అనుసంధానం చేశారో తెలియడం లేదు. వారం రోజుల క్రితం విక్రయించిన 33 క్వింటాళ్ల పత్తికి సంబంధించి డబ్బులు ఎస్‌బీఐలో పడలేదు. దీంతో ఏ బ్యాంకులో పడ్డాయో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఆధార్‌తో పాటు ఖాతా సంఖ్య తీసుకోవాలి : బండి దత్తాత్రి, రైతు సంఘం నాయకుడు



మార్కెట్‌లో పత్తి అమ్మకానికి వచ్చిన రైతుల ఆధార్ నెంబర్లు తీసుకుంటున్న సిబ్బంది వారు చెప్పిన ఖాతాలకే అనుసంధానం చేయాలి. కానీ సిబ్బంది ఆయా రైతులకు సంబంధించి ఏదేని ఒక ఖాతాకు అనుసంధానం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో రైతులు రెగ్యూలర్‌గా ఉపయోగించే ఖాతాకు కాకుండా వారికి సంబంధించి ఏదేని ఒక ఖాతాలో పడుతున్నాయి. దీంతో ఏ బ్యాంకుల్లో పడుతున్నాయో తెలియక రైతులు అయోమాయానికి గురవుతున్నారు. ఆధార్‌తో పాటు బ్యాంకు పాస్ పుస్తకం కూడా తీసుకొని వాటి ప్రకారం అనుసంధానం చేస్తే బాగుంటుంది.

సమస్య పరిష్కారానికి చర్యలు : శ్రీనివాస్, మార్కెట్ ఏడీ, ఆదిలాబాద్



మార్కెట్‌లో పత్తి విక్రయించే రైతులకు సంబంధించి బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేపడుతున్నాం. కానీ రైతులకు సంబంధించి వారి ఇష్టమొచ్చిన ఖాతాల్లో డబ్బులు పడటం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. ఎక్కడ సమస్య ఉత్పన్నమవుతుందో తెలుసుకొని పరిష్కరించేందుకు కృషిచేస్తాం.


మార్కెట్ ఏడీతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని భారత్ వికాసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సంబంధిత శాఖ అధికారులు సూచించారు. మంగళవారం షెట్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడి రవి ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశమైన అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. బడుగు బలహీణ వర్గాల వారి శ్రేయస్సు కోరి అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్, అన్న యోజన, ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, జీవన జ్యోతి బీమా తదితర పథకాల ద్వారా కల్పించే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన గ్రామ పంచాయతి ప్రజల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇందారం దక్కన్ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, కుందారం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు శ్రావ్య, పంచాయతీ పరిధి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో వసూలు చేయాలి



నవతెలంగాణ-తాండూర్

పంచాయతీలలో పన్నుల వసూలు వేగవంతం చేసి గ్రామపంచాయతీలకు ఆదాయాలను సమకూర్చాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఫణిదర్‌రావు సూచించారు. మంగళవారం అచలాపూర్ గ్రామపంచాయతీని ఆకస్మికంగా సందర్శించి పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామపంచాయతీలో వివిధ రకాల పన్నులను వసూలు చేసి ఆదాయాలను పెంచుకోవాలని సూచించారు. అదనపు ఆదాయాల గురించి ఆలోచన చేయాలన్నారు. ఈ నెలాఖరు లోపు గ్రామపంచాయతీలో వంద శాతం పన్ను వసూలయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. నర్సరీని వేగవంతం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలో ప్రతిరోజు తడి పొడి చెత్త వేరుగా సేకరిస్తూ సెగ్రిగేషన్ షెడ్‌లో సెగ్రిగేషన్ చేస్తూ కాంపోస్టు తయారు చేయాలని ఆదేశించారు. ప్రతి వారం మంచినీటి ట్యాంకులలో క్లోరినేషన్ విధిగా చేయాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ దాగం శంకరమ్మ, పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్ ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-లక్షెట్టిపేట

సెమీ క్రిస్మస్ వేడుకలు పట్టణంలోని సిఎస్ఐ రైడల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిఎస్ఐ పాఠశాల అనుబంధ సంస్థ హాస్టల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.డేవిడ్‌పాల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతాయని, యేసు క్రీస్తు జననం సందర్భంగా ఈ వేడుకలు జరుపుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మినిస్టీరియల్ సెక్రటేరి ఎం.జయనందము, ప్రేమనందము, శ్రీనివాస్ హాజరై ప్రతి విద్యార్థికి బహుమతులు అందజేశారు. కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.డేవిడ్‌పాల్, వార్డెన్లు సత్యవతి-థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



జైపూర్ : మండల కేంద్రంలో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు బల్మూరు అరవింద్‌రావు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో గత సంవత్సరం విగ్రహం ప్రతిష్ఠించి ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 22 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు యజ్ఞాది పూజా కార్యక్రమాలతో పాటు హోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. బుధవారం కుంకుమ పూజ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నందున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఐదు రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానిక సర్పంచ్ ఆసంపల్లి సువర్ణ రాజమల్లు, ఎంటీపీసీ లింగస్వామి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

27నే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి బోసు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి బోసు

నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 27వ తేదీనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి బోసు అన్నారు. మంగళవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పి-3గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. హైకోర్టులో తీర్పు ప్రకారం సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఈ నెల 27వ తేదీన నిర్వహించాలన్నారు. కొన్ని సంఘాలు సింగరేణి ఎన్నికలు వాయిదా వేయాలని చూస్తున్నాయని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేయడంతో కార్మికుల వ్యతిరేకతకు గురై అధికారం కోల్పోయారని తెలిపారు. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గత రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగానే ఎన్నికలను వాయిదా వేయడానికి చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో రాజకీయ జోక్యం అధికం కావడంతో సంస్థ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొందని, సింగరేణిలో ఆర్థిక దుబారా పెరిగి సంస్థ భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. సింగరేణిలో గత గుర్తింపు సంఘంతో అవినీతి పెరిగిందని, టీబీజీకేఎస్ మూలాన సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మారిందన్నారు. సింగరేణిలో జరగనున్న గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీని ఆదరించి గెలిపించడం ద్వారా అనేక హక్కులు సాధించడానికి, ఉన్న హక్కులను కాపాడడానికి పాటుపడతామని పేర్కొన్నారు. అధికారులకు సింగరేణి యాజమాన్యం చెల్లిస్తున్న పెర్క్స్‌పై ఇన్‌కం టాక్సను కార్మికులకు కూడా సింగరేణి యాజమాన్యం ద్వారా చెల్లింపజేస్తామన్నారు. కార్మికుల సొంతింటి కల అమలుకు 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.20లక్షల వడ్డీ లేని రుణం ఇప్పిస్తామన్నారు. నూతన బొగ్గు బావులను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కంపెనీలో బొగ్గు తీసే పనిలో కాంట్రాక్ట్ కార్మికులకు బదులు పర్మినెంట్ కార్మికులనే నియమించే విధంగా చూస్తామన్నారు. కంపెనీ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సౌకర్యం అందించడానికి కృషి చేస్తామన్నారు. రిటైర్ అయిన కార్మికులకు గతంలో మాదిరిగా రిటైర్డ్ అయిన రోజే టర్మినల్ బెనిఫిట్స్, పెన్షన్, గ్రాట్యుటీ ఇప్పిస్తామన్నారు. 12 సంవత్సరాలుగా కార్మికులకు నష్టం చేసిన నాయకులు తిరిగి మళ్లీ మోసం చేయడానికి కండువాలు మార్చుకొని వస్తున్నారని, విజ్ఞులైన కార్మిక వర్గం అలాంటి వారి మాయమాటలు నమ్మకుండా గతంలో సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన, భవిష్యత్తులో అనేక హక్కులు సాధించే సత్తా కలిగిన ఏఐటీయూసీ చుక్క గుర్తుకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ట్రేడ్‌మేన్స్ నాయకులు వేణుమాధవ్, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, రాచర్ల చంద్రమోహన్, ఫిట్ కార్యదర్శి నరసింగరావు, అఫ్రోజ్‌ఖాన్, మురళీచౌదరి, మల్లేష్, అంబాల రవి, లక్ష్మీరెడ్డి, సత్తిరెడ్డి, జీపిరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



నవతెలంగాణ - దహెగాం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై పేద, మధ్య తరగతి ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం వల్లనే ప్రజలు ఆర్థికంగా వెనుకబడి పోతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని కొత్మీర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వికసిస్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలను ప్రజల వద్దకు చేర్చడమే వికసిస్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నప్పటికీ వాటి గురించి అవగాహన కల్పించకపోవడం వల్ల ప్రజలు చాలా నష్టపోతున్నారన్నారు. వాటన్నింటినీ అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేల ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. విశ్వకర్మ యోజన పథకం 18 కులాలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి వాటితో పాటు పనిముట్లు కొనుగోలు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. మరో రూ.3లక్షల వరకు కూడా రుణం అందించనున్నట్టు పేర్కొన్నారు. అలాగే అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ముద్రా యోజన, ఫసల్ బీమా యోజన తదితర పథకాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ 2047 సంవత్సరంలో భారతదేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకే మోడీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ సంక్షేమ, ఆరోగ్య పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హన్మంతు, తహసీల్దార్ కవిత, ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్, గ్రామీణ బ్యాంకు మేనేజర్ నవీన్, స్థానిక సర్పంచ్ కరణం సుల్తానా, పీఏసీఎస్ చైర్మన్ కోండ్ర తిరుపతిగౌడ్, వైస్ చైర్మన్ రాపర్తి ధనుంజయ, డైరెక్టర్ దుండ్ర శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, ఎలుకరి దామోదర్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. వాంకిడి మండలంలోని ఎనిమిది గ్రామాలకు చెందిన గ్రామ పటేళ్లు పార్టీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి తమ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. గత పది సంవత్సరాలు బీఆర్ఎస్ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. పోడు సాగుదారులకు పూర్తిస్థాయిలో పట్టారు ఇవ్వడం తమతోనే సాధ్యమవుతుందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మసాదే చరణ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అలీ, నాయకులు మునీర్ అహ్మద్, మేకర్తి శ్రీను, మంగ, కాషయ్య జావీద్, అబ్బు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | డిసెంబర్ 20, 2023 | www.navatelangana.com

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏఎస్పీ

నవతెలంగాణ-ముధోల్

ముధోల్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పచ్చదనాన్ని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పనిచేస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు ఏఎస్పీకి సీఐ, ఎస్సైలు పూల మొక్కలను అందజేశారు. పోలీసులచే గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ వినోద్ రెడ్డి, ఎస్సైలు సాయికిరణ్, మోహన్‌రావు ఉన్నారు.



ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తరువాత మొదటి సారి జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌ని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పాయల్ శంకర్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీని శాలువాతో సత్కరించారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించిన పోలీస్ యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ వ్యవస్థపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.



విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-కడెం

చిన్న బెల్లాల్ గ్రామంలో విద్యుత్ తీగల వలన చాలా సమస్యలు ఎదుర్కొంటున్నామని కడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం చిన్న బెల్లాల్ గ్రామంలో విద్యుత్ శాఖ ఏఈ సుమన్ కుమార్‌తో పరిశీలించి, వారి సమస్య గురించి అధికారులకు వివరించారు. వారి సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేయాలని ఏఈని, వారి సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు సొదాని రాజన్న, పడిగెల భూషణ్, శీను, ప్రవీణ్, సోమశేఖర్, తిరుపతి, రవి, రావు, దేవ్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన డీఆర్డీఓ విజయలక్ష్మి



నవతెలంగాణ కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గురుకుల పాఠశాలను మంగళవారం డీఆర్డీఓ విజయలక్ష్మి సందర్శించారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో తప్పకుండా భోజన మెనూ పాటించాలని అన్నారు. అనంతరం నచ్చన్ ఎల్లాపూర్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, ఏపీఓ జయదేవ్, టీఏ గణేష్, ఎఫ్ఏ కమలాకర్, కారోబారి మహేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని తాడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు, హెచ్ఈఓ నాందేవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరానికి హైదరాబాద్ నుంచి చిల్డ్రన్ జనరల్ తదితర స్పెషలిస్ట్ వైద్యులు వస్తున్నట్టు తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్ఓ బాలు అధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. వివిధ రకాల టెస్టులు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి హామీ గ్రామసభ



నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్ (జి) మండలంలోని బామ్ని గ్రామంలో సర్పంచ్ దేవుళ్ల పుష్పల అధ్యక్షతన మంగళవారం గ్రామపంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. 2024-2025 సంవత్సర ఉపాధి హామీ పనుల ఆమోదం కొరకు చర్చించి, వివిధ నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీఏ రవీందర్ గ్రామంలోని జాబ్ కార్డుల వివరాలు, ఉపాధి కూలీలు చేసిన పనుల వివరాలు చదివి వినిపించారు. ఈ సంవత్సరం చేపట్టబోయే పనుల వివరాలను గ్రామస్తులకు, రైతులకు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఘనశ్యామ్, విఠల్, నాయకులు దేవుళ్ల పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి గంగాజల, వార్డు సభ్యులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలి



నవతెలంగాణ-పెంబి

పట్టుదలతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా సాధించవచ్చని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మందపల్లి గ్రామంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశ్విన్ సంగ్వాన్‌తో కలిసి కేజీబీవీ పాఠశాలను ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించడానికి అహర్నిశలు కృషి చేయాలని అన్నారు. కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల పాల్గొన్నారు.

ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయకూడదు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయ రంగానికి ఉపాధి హామీ పనులను అనుసంధానం చేయకూడదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఉపాధిహామీ కూలీల కూలీరెట్లు రూ.300లకు పెంచుతామని, సంవత్సరానికి 150 రోజుల పనులు కల్పిస్తామని చెప్పడాన్ని మేము స్వాగతిస్తున్నామని అన్నారు. వ్యవసాయ రంగానికి ఉపాధిహామీ పనులు అనుసంధానం చేసినట్లయితే అది భూస్వాములకు దొరలకు పెత్తందారులకు ఉపయోగపడేది మాత్రమే అవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ అనగారిన కులాలకు చెందిన వారి భూముల్లో ఉపాధి హామీ చట్టం నిర్ణయించిన ప్రకారం పనులు కల్పించడానికి గుర్తించిన పనులు చాలా ఉన్నాయన్నారు. ఆ పనులను చేయించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని సూచిస్తున్నామన్నారు. ఉపాధి హామీలో ఇప్పటికే పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరుతున్నామన్నారు. గ్రామసభల ద్వారా ఉపాధిహామీ పనులు ఇప్పటికే అధికారులు గుర్తిస్తున్నారని అన్నారు. జాబ్ కార్డు లేనటువంటి వ్యవసాయ కూలీలందరికీ జాబు కార్డులు ఇవ్వాలని అన్నారు. జిల్లాలో మెజార్టీగా కూలీల దగ్గర నుంచి వారానికి రూ.100 వసూలు చేస్తున్నటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. అవినీతికి తావు లేకుండా ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బర్కుంట గంగారాం పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి నిరంతరం వ్యాయామం తప్పనిసరి

- ముగిసిన పోలీస్ వార్షిక క్రీడా పోటీలు
- బహుమతులను ప్రదానం చేసిన ఎస్పీ



పోలీస్ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీసు సిబ్బందికి నిరంతరం వ్యాయామం తప్పనిసరి అని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో క్రీడా పోటీలను నిర్వహించారు. మంగళవారం క్రీడల ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధులతో పాటు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటిస్తూ వ్యాయామం, క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం ఈ వార్షిక క్రీడలను నిర్వహించే విధంగా సిబ్బందికి ఆదేశాలను జారీ చేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిగా తీసుకొని పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క పోలీస్ సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. రెండు రోజుల పాటు క్రీడలు జరిగే సమయంలో మైదానంలో ఉంటూ వైద్య సేవలు అందించిన వైద్య అధికారి అవినాష్‌కు, వారి బృందానికి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా పోలీసు శారీరక దేహదారుఢ్య పరీక్షల్లో ఎటువంటి సమయములోనైనా తమ సేవలను అందించి క్రీడలను సజావుగా నిర్వహించేందుకు తోడ్పడిన వారికి ప్రత్యేకంగా శాలువా, మెమెంటో అందజేసి సత్కరించారు. అదేవిధంగా మహిళల బ్యాట్‌మెంటన్, పురుషుల బ్యాట్‌మెంటన్, మహిళల పరుగు పందెం, డబుల్ బ్యాట్‌మెంటన్ క్రీడలలో గెలుపొందిన అధికారులకు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ డీసీఆర్బి సీహెచ్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు టి మురళి, నవీన్ కుమార్, స్వామి, రిజర్వ్ సిబ్బంది, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా అధికారులు పనిచేయాలి

- మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రివ్యూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ అధికారులు పనులు చేయాలని, వారికి తన మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారిగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, సిబ్బంది వివరాలను కమిషనర్ శైలజ ఎమ్మెల్యేకు వివరించారు. ముందుగా రివ్యూకు హాజరైన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం పలు అంశాలపై ఎమ్మెల్యే అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు వ్యాపారుల కోసం మల్గిలను కట్టించారన్నారు. అయిన వారు మళ్లీ రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారన్నారు. తొలుత కార్మికులకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించేలా చూడాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో వారు కీలకంగా ఉంటారన్నారు. దీని కోసం ఆర్థికంగా బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్సుల వసూళ్ల విషయంలో మరింత కఠినంగా ఉండాలన్నారు. తక్కువ ట్యాక్స్ ఉన్న వారితో అధిక ట్యాక్స్ ఉన్న వారిపై ఒత్తిడి పెంచాలన్నారు. అనుమతులు లేకుండా ఉన్న హోర్డింగ్‌లను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. బిల్లులు చెల్లించని యాడ్స్ ఏజెన్సీలను తొలగించాలని ఈ సందర్భంగా సూచించారు.

అధికారులపై ప్రశ్నల వర్షం..

కేఆర్‌కే కాలనీలో మంజూరైన రోడ్లు, మురికి కాలువల పనులు ఇంతవరకు ఎందుకు పూర్తి కాలేదని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ నల్లాలు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అన్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఆదిలాబాద్‌లోని ప్రధాన వీధుల్లో రోడ్లను ఆక్రమించుకొని వందల సంఖ్యలో తోపుడు బండ్లు ఉన్నాయని అన్నారు. కేవలం 300 మీటర్ల మార్గం దాటలంటే 20 నిమిషాల సమయం పడుతుందన్నారు. ఆ మార్గం గుండా నడవడానికి మహిళలు భయపడే పరిస్థితి ఉందని అన్నారు. రోడ్లపై అక్రమణలు ఉండకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కోట్ల రూపాయలతో పరిష్కారాలు చేయబడ్డాయన్నారు. మరి ఆ షెడ్లలోకి ఈ ఫూట్ పాత్ వ్యాపారులను ఎందుకు షిఫ్ట్ చేయలేదని అధికారులను ప్రశ్నించారు. ఏరోడ్రమ్ ప్రక్కన ఉన్న అక్రమ గోవధ శాలను ఎందుకు ఉపేక్షిస్తున్నారని అన్నారు. పక్కనే ఉన్న ఇందిరమ్మ కాలనీ వాసులు ఇబ్బందులు మీకు కనిపించలేదా అని అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసేలా కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా, ఖాళీ స్థలాలకు జారీ చేసిన ఇంటి నెంబర్లను రద్దు చేయాలన్నారు. అదే విధంగా ఉద్యోగుల సమస్యల విషయంలో వ్యక్తిగతంగా, అధికారికంగా తన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. అదే ప్రజల విషయంలో వారు నిర్లక్ష్యం వహిస్తే అంతే కఠినంగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ తిరుపతి, ఏఈ అరుణ్, కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, రాజేశ్, కృష్ణయాదవ్, అధికారులు పాల్గొన్నారు.

చిత్తనూర్ ఇథనాల్ ఫ్యాక్టరీని సందర్శించిన గ్రామస్తులు



ఫ్యాక్టరీ వద్ద పోరాట కమిటీ సభ్యులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంటపొలాల్లో పీఎంకే కంపెనీ వారు ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల జరిగే దుష్ప్రభావాలు తెలుసుకునేందుకు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా చిత్తనూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీని సందర్శించేందుకు ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో వీడీసీ సభ్యులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఇథనాల్ పోరాట సమితి సభ్యులను ఆ గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతించారు. వారు ఫ్యాక్టరీ చుట్టూ పక్క గ్రామాల్లో ఏర్పడిన దుష్ప్రభావాల గురించి కమిటీ సభ్యులకు తెలియజేశారు. ఫ్యాక్టరీ నుంచి వెదజల్లే దుర్గంధం, వాయువు వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఫ్యాక్టరీ నుంచి విడుదలయ్యే నీటి వల్ల చెరువుల్లోని చేపలన్నీ చనిపోయాయని తెలిపారు. ఆ నీటిలో స్నానం చేసిన బాలునికి దద్దుర్లు రావడంతో గ్రామస్తుల్లో చైతన్యం వచ్చిందని తెలిపారు. ఫ్యాక్టరీ సందర్శించేందుకు వెళ్లిన వారిని యాజమాన్యం ఫ్యాక్టరీలోకి అనుమతించకపోవడంతో చిత్తనూర్ గ్రామస్తులు వారితో వాగ్వాదానికి దిగారు. దుష్ప్రభావాలు ప్రబలుతాయని తెలుసుకుంటారనే ఫ్యాక్టరీలోకి అనుమతించడం లేదని పేర్కొన్నారు. ఇకనైనా గ్రామస్తులంతా ఏకమై పోరాటాన్ని ఉధృతం చేయాలని గ్రామ ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు నిర్ణయించారు. బుధవారం దిలావర్‌పూర్ గ్రామబంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని వ్యాపార సముదాయాలు, గ్రామస్తులు స్వచ్ఛందంగా సహకరించాలని కోరారు.

డిజిటల్ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నార్నూర్

టీజీబీ బ్యాంక్ అందిస్తున్న డిజిటల్ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తాడిహత్నూర్ టీజీబీ బ్రాంచ్ మేనేజర్ ఆంబోతు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జామడ గ్రామపంచాయతీలో కళాజాత ద్వారా ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులకు బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు. బ్యాంక్ ద్వారా అందించే బీమా పథకాలు, క్రాప్‌లోన్, డ్వాక్రా మహిళ సంఘాల రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. బ్యాంకు రుణాలు చెల్లించిన వారికి కొత్త రుణాలు మంజూరు చేస్తామని సూచించారు. రుణాలను సక్రమంగా తీసుకొని సమయానికి చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మడావి ముక్తా రూపదేవ్, జిల్లా సార్మెడి మెస్రం దుర్గు పటేల్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, బ్యాంక్ సిబ్బంది గంగూలీ, సీఎస్‌సీ నిర్వాహకులు ఫడ్ రవీందర్, రాంజీ పటేల్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ ఎంపీపీ



నవతెలంగాణ-సిరికొండ

బీజేపీకి భారీ షాక్ తగిలింది. సిరికొండ ఎంపీపీ పెందూర్ అమృత్ రావ్, జెడ్పీటీసీ భర్త, కన్నాపూర్ సర్పంచ్ రఘురాం, పలువురు నాయకులు రాజీనామా చేశారు. మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో ఉట్నూర్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే వారిని ఆహ్వానించారు. నూతనంగా ఏర్పడిన సిరికొండ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అనిల్, పాండు, అమృత్ రావ్, బషీర్, రంజాన్, వెంకటేష్, భగవంత్‌రావ్ పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్టును పరిశీలించిన స్కాడా ఎక్స్‌పర్ట్ బృందం సభ్యులు



నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టును స్కాడా ఎక్స్‌పర్ట్ బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మీద స్కాడా ఎక్స్‌పర్ట్ బృందం పర్యటించి, కడెం ప్రాజెక్టు గేట్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, స్క్రీన్ మానిటరింగ్ విధానాలను సెన్సర్లను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్కాడా పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయని డ్యాం రిపేరింగ్ వర్క్స్‌లో భాగంగా కొంత లేట్ అవుతున్నాయని తెలిపారు. త్వరలో స్కాడా సిస్టం పూర్తి పనులు పూర్తి చేసి, స్కాడా సేవలను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కాడా సిస్టం ఎక్స్‌పర్ట్ బృందం సభ్యులు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏఆర్ఎస్ శర్మ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, కడెం ప్రాజెక్టు డీఈ బోజదాస్, జేఈ రవి నాయక్ పాల్గొన్నారు.

తేనెటీగలతోనే మానవ జాతి మనుగడ సాధ్యం



నవతెలంగాణ-పెంబి

ఈ భూమండలంపై మానవ జాతి మనుగడ సాధించాలంటే తేనెటీగల ఉనికిని కాపాడటం అత్యావశ్యకమని ఇటిక్యాల వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ చేతుల మీదుగా నేషనల్ బోర్డు, ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం వారు సంయుక్తంగా నిర్వహించిన తేనెటీగల శిక్షణకు సంబంధించిన ధృవపత్రాన్ని ఏఈఓ అందుకున్నారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ పెంబి మండల పరిధిలో ఉన్న వైవిధ్యమైన అటవీ ప్రాంతం, పూల మొక్కలు, పంటలు తేనెటీగల పెంపకానికి అనువుగా ఉండటంతో గిరిజన రైతులకు, యువకులకు వ్యవసాయ అనుబంధ ఉపాధి కల్పించడం లక్ష్యంగా తేనెటీగల శిక్షణను తీసుకున్నట్టు తెలిపారు. స్థానికంగా గిరిజన రైతులు ఏర్పాటు చేసుకున్న పెంబి ట్రైబల్ ఎఫ్‌పీఓ వారి సహకారంతో మండల పరిధిలో తేనెటీగల పెంపకం, తేనె తయారీ, శిక్షణ, పండ్ల తోటల రైతులకు బాక్సులను రెంటుకు ఇచ్చేలాగా కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటుకు ఎఫ్‌పీఓ తరఫున ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. తేనెటీగల పెంపకంపై ఆసక్తి కలిగిన రైతులకు ఉచితంగా శిక్షణ ఇస్తామని ఏఈఓ తెలిపారు.

దాతృత్వం చాటుకున్న ఎంపీపీ పెందూర్ మోతీరాం

నవతెలంగాణ-కెరమెరి



ప్రమాదంలో గాయపడిన యువకుల్ని సకాలంలో ఆస్పత్రికి తరలించిన ఎంపీపీ పెందూర్ మోతీరాం తన దాతృత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం మండలంలోని భారేమోడి గ్రామానికి చెందిన సెండే గణేష్ అనే యువకుడు తన ద్విచక్ర వాహనంపై కోలాం ఝరి సమీపంలోని పొలానికి బయలుదేరాడు. మార్గమధ్యలో అదుపుతప్పి బైక్ పై నుండి కింద పడడంతో గాయాలయ్యాయి. అదే సమయంలో అటువైపుగా వస్తున్న ఎంపీపీ పేందూరు మోతిరాం గాయాల పాలైన సదరు యువకున్ని గమనించి తన ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి తరలించి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. బైక్ పై నుండి గాయాలపాలయ పడిన యువకుల్ని సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించిన ఎంపీపీని మండల ప్రజలు అభినందించారు.

నేటి నుంచి జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 20 నుంచి 23 వరకు అండర్ 14 బాల బాలికల రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు క్రీడా నిర్వాహకులు జిల్లా క్రీడల అధికారిని రమాదేవి తెలిపారు. క్రీడలు నిర్వహించే ప్రాంగణాన్ని నిర్వహన కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పాఠశాలల క్రీడల సమైక్య, గిరిజన సంక్షేమ శాఖ సంయుక్తంగా ఈ క్రీడలను నిర్వహించ తలపెట్టిందన్నారు. బాలికలకు ఆదర్శ క్రీడ పాఠశాలలో, బాలురకు ఆదివాసీ భవన్‌లో వేరువేరుగా వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులకు వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన వసతులు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడల సమైక్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, గిరిజన సంక్షేమ క్రీడల అధికారి మీనా రెడ్డి, ఎసీఎంఓ ఉద్ధవ్, ఎటీడీఓ క్షేత్రయ్య జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు మధుసూదన్, నరేందర్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబుకు పీఆర్టీయూటీఎస్ సన్మానం



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును పీఆర్టీయూటీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాసరావు, ఆడే ప్రకాష్ మాట్లాడుతూ 317 జీఓ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, జిల్లాలోని 500 ఖాళీలను డీఎస్సీ ద్వారా నియమించేలా చర్యలు తీసుకోవాలని, సీపీఎస్ అంశాన్ని రద్దు చేసే విధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని, ఆగిపోయిన బదిలీలు పదోన్నతులు షెడ్యూల్లను కొనసాగించాలని కోరారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయులు లేవనెత్తిన అంశాలన్నిటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని త్వరలో ఉపాధ్యాయులందరితో సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎనగంటి బిక్షపతి, పత్తిపాక శ్రావణ్, మడావి హనుమంతు, రతన్ గైన్, దోంతి రాజు, వేణుగోపాల్ రావు, బుడుగు శ్రీనివాస్, రాంటెంకి బాబు రావు, గుండు యాదగిరి, రాకేష్, కమలాకర్ రెడ్డి, లాలాజీ, ఇందారపు ప్రకాష్, మంజంపల్లి రమేష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కొత్తపల్లి వెంకటలక్ష్మి- చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటి ఆధర్వంలో మంగళవారం కిమ్స్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనిత దంపతులు నిర్వహించే ఉచిత కంటి పరీక్షల్లో భాగంగా 26 మంది హాజరు కాగా వారిలో 12 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. కంటి పరీక్షలకు వచ్చిన వృద్ధులను అధైర్య పడవద్దని లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్‌లు చేపిస్తామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తమలజిస్ట్ వసి, గోపి, కిమ్స్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనంచేసి రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రిజర్వేషన్ ఆధారంగా ఎంపికై ఉద్యోగభద్రతకు అర్హతకలిగి ఉన్నామని, అన్నిరకాల అర్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగ భద్రతకు నోచుకోలేదన్నారు. కనీసవేతన స్కేలును అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవితబీమా రూ.10 లక్షలు, ఆరోగ్యబీమా రూ.5 లక్షలు కల్పించాలని, విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షులు విజయ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి తుకారాం, గౌరవ అధ్యక్షులు కొప్పుల మోహన్, జిల్లా అధికార ప్రతినిధి దహెగం పవన్ కుమార్, జిల్లా నాయకులు గేదేకర్ సంతోష్, సందీప్, రాజేశ్, నాగేష్, సంతేన భోజన్న పాల్గొన్నారు.

పెండ్లి చేసుకుంటానని మోసం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెళ్లి చేసుకుంటానని మోసం చేసి వేరే యువతిని పెళ్లి చేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై బాధిత యువతి మంగళవారం ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెంచికల్‌పేట్ మండలం అగర్ గూడా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న బోరుకుటే భరత్ గత కొన్ని రోజులుగా ఆసిఫాబాద్ పట్టణంలోని చెక్ పోస్ట్ కాలనీలో నివాసం ఉంటున్న యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి మోసం చేశాడు. రెండు రోజుల క్రితం పెంచికల్‌పేట మండలంకు చెందిన వేరే యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో బాధిత యువతి తనను పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని తనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

మున్సిపల్ వర్కర్ల వేతనాలు చెల్లించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ధర్నా నిర్వహించగా చైర్మన్ వచ్చి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ పూర్తిస్థాయిలో జూన్ మొదటి వారంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటి వరకు సమస్య పరిష్కారం కాలేదని గత మూడు నెలల నుంచి ఎంఎంఆర్ కార్మికులకు, పారిశుధ్య కార్మికులకు రెండు నెలలుగా జీతాలు రాక కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారిందన్నారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ఈ శంకర్ కార్యదర్శి సంజీవ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ విద్యారంగం బలపేతానికి నూతన ప్రభుత్వం కృషి చేయాలని, చాలా కాలంగా పెండింగ్లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. తిర్యాణి మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ 317 జీఓ ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులందరికీ స్థానికత ఆధారంగా న్యాయం చేయాలని, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల సీఆర్టీలకు, పాఠశాల సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులను మంజూరు చేయాలని, కేజీబీవీ పాఠశాలల్లో కేర్ టేకర్స్‌ను నియమించాలని, గత పీఆర్సీలో నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా నూతన పీఆర్సీ కమిటీని ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసే దిశగా రాష్ట్ర నాయకత్వం ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తుందని, బదిలీలు పదోన్నతులకు సంబంధించిన కోర్టు కేసులపై ప్రభుత్వం చొరవ చూపి బదిలీలు పదోన్నతులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చాపిడి శ్రీనివాస్, తిర్యాణి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల బాధ్యులు వెంకటేష్, నాయకులు రమేష్, భీంరావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి



నవతెలంగాణ-రెబ్బెన

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంఘం ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఏర్పాటుచేసిన ద్వార సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి మొన్నటిదాకా బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్ మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బీఆర్ఎస్ మాదిరిగానే రాజకీయ జోక్యంతో సంస్థను ఆర్థికంగా దోపిడి చేయాలని ఇప్పుడు కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఐఎన్‌టీయూసీ కూడా ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. మొన్నటి వరకు కార్మికుల సమస్యలు ఏ మాత్రం పట్టించుకోని యూనియన్‌లు ఇప్పుడు కార్మికులకు మాయమాటలు చెప్పి ఓట్లు అడుగుతున్నారని, కార్మికులు అన్ని విషయాలు గమనించి ఎళ్లవేళల కార్మికుల పక్షాన ఉంటూ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తున్న ఏఐటీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధనలో అలుపెరుగని పోరాటాలు చేసిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. పైరవీల పెత్తాందారుల కొమ్ముకాసే ప్రభుత్వ సంఘాలకు బుద్ధి చెప్పాలని, అక్రమ సంపాదనే ధ్యేయంగా, పైసలోనే పని అన్నట్టుగా వ్యవహరిస్తూ స్వలాభం కోసమే పాటుపడే టీబీజీకేఎస్ ప్రభుత్వ సంఘాన్ని మరొకసారి నమ్మవద్దని తెలిపారు. కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన ఏఐటీయూసీ యూనియన్ చుక్క గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ప్రభుత్వ అనుబంధ సంఘాలను ఆధరిస్తూ యాజమాన్యం తొత్తులుగా మారిన సంస్థలు రాజకీయ జోక్యం ఎక్కువై ఆర్థిక దోపిడికి గురవుతుందని, సింగరేణి సంస్థను ఆలోచించి కాపాడాలని కార్మికులను ఆయన కోరారు. సమావేశంలో గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు భయ్యా మొగిళి, సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శి రామయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్, ఉయిక చంద్రశేఖర్, సముద్రాల ఆనంద్, ఫిట్ కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, మారం శ్రీనివాస్, కందుల మల్లేష్, నాయకులు ఎస్‌కె జాహిద్, వెంకటేశం, శ్రీనివాస్, చంద్రయ్య, కాన శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఇన్‌ఛార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు



నవతెలంగాణ-కౌటాల

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొమురంభీం జిల్లా ఇన్‌ఛార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని సహకార సంఘం కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సౌకర్యంగా అందుబాటులో ఉండేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్టు ఆయన అన్నారు. తేమ శాతం పేరుతో రైతులను మోసం చేయవద్దని, రైతులకు మద్దతు ధర రూ.2203 ఎ గ్రేడ్, రూ.2183 బి గ్రేడ్ వడ్లకు మద్దతు ధర ఉంటుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రం వద్దకు వడ్లు తీసుకొచ్చేటప్పుడు పట్టా పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా రెండు జతలు జిరాక్స్ తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో వడ్లను అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్, సర్పంచ్ వొజ్జెల మౌనీష్, డైరెక్టర్ ఎర్రోళ్ల ఎర్రయ్య, ఉప సర్పంచ్ పసునూరి తిరుపతి, బీఆర్ఎస్ మండల యువజన సంఘం అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్, సహకార సంఘం సీఈఓ రాజేష్, సిబ్బంది ఖాజీంహుస్సేన్, నాయకులు ఎలుముల మల్లయ్య, వానుపటేల్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే టీబీజీకేఎస్ ధ్యేయం

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు కల్పించిన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అనుబంధ సంస్థ అయిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, సింగరేణి కార్మికుల హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడే తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంతోనే సాధ్యమని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మాదారం టౌన్‌షిప్‌లోని సివిల్ డిపార్టుమెంట్ డిస్పెన్సరీలో, గోలేటిలోని బెల్లంపల్లి ఏరియా స్టోర్‌లో ఏజెంట్ కార్యాలయంలోని వృత్తి శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన గేట్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సింగరేణి కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో వారసత్వ ఉద్యోగాలు, లాభాల వాటా 32 శాతానికి పెంచి ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే సింగరేణి కార్మికులకు సొంతింటి నిర్మాణం కోసం బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్మిక క్వార్టర్లలో సింగరేణి కార్మికులకు ఏసీలకు అనుమతితో పాటు కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘం ప్రకాష్‌గౌడ్, కార్పొరేట్ చర్చల ప్రతినిధి దరావత్ మంగీలాల్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, అబ్బాపూర్ ఓపెన్‌కాస్ట్ ఫిట్ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, ఏరియా నాయకులు రాజేశం, కోరం కిరణ్, ఏరియా స్టోర్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి గణపతి, బొద్దెన శ్రీనివాస్, కమిటీ సభ్యురాలు కల్పన పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందేలా చూడాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా అధికారులు, సిబ్బంది పనిచేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ సూచించారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ఎమ్మెల్యే మంగళవారం కాగజ్‌నగర్ సీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ వైద్య వ్యవస్థలో సగం పోస్టులు ఖాళీగా ఉండడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. వెంటనే సిబ్బంది భర్తీ కోసం చర్యలు తీసుకుంటామని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ సీహెచ్ సీ ప్రాంగణంలోని పాత భవనాన్ని పరిశీలించిన వెంటనే దాన్ని కూల్చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవరావు, డాక్టర్లు శ్రీధర్ బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్ రావు, సీతారాం వివిధ పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు గురుకుల విద్యార్థిని ఎంపిక



నవతెలంగాణ-లక్సెట్టిపేట

జాతీయ స్థాయి బేస్ బాల్ పోటీలకు లక్సెట్టిపేట గురుకుల విద్యార్థిని ఎంపిక అయినట్టు ప్రిన్సిపల్ లలిత కుమారి తెలిపారు. ఈ నెల 16, 17, 18 తేదీలలో మహబూబా బాద్ జిల్లా తొర్రూరులో, 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలలో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున ఆడి, ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థిని కుమారి ప్రజ్ఞను మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కే.మహేశ్వరరావు, పీడీ, పీఈటీ మల్లిక, మమత, హౌస్ మేడమ్ ఉమాదేవి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ జి.మౌనిక పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ విరాళం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ ప్రాథమిక పాఠశాలకు జన్నారం గ్రామానికి చెందిన జోజి బాబు ఆయన తల్లిదండ్రులు వేగే రత్తయ్య, సరోజనల జ్ఞాపకార్థం స్మార్ట్ టీవీ అందచేశాడు. ఈ స్మార్ట్ టీవీని మంగళవారం సర్పంచ్ ఆరే జ్యోతి శిరీష్, ఉప సర్పంచ్ మేకల లక్ష్మీ మాణిక్యం, వైస్ ఎంపీపీ సుతారి వినయ్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్ ప్రధాన ఉపాధ్యాయులు మురళీధర్, ఎస్ఎంసీ చైర్మన్ తిరుపతి, ఉపాధ్యాయులు కస్తూరి శ్రీకాంత్, అంబాజీ, మంజుల పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను వేగవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం మండలంలోని చింతగూడ, తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాలలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. గ్రామపంచాయతీలోని ప్రతి రోడ్డు, నాలీలు శుభ్రంగా ఉంచాలని, ప్రతి రోజు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌లో చెత్తను వేరు చేయాలని అన్నారు. ప్రతి శుక్రవారం గ్రీన్ డేలో భాగంగా గ్రామపంచాయతీలోని మొక్కలకు నీరు అందించాలని ఆదేశించారు. గ్రామ నర్సరీ పనులను సమయపాలన పాటిస్తూ అనంతరం గ్రామ పంచాయతీలోని రికార్డులను తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేత

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించిన మార్చ్ 2022 సీఎంపీఎఫ్ చిట్టిలను ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సీఎంపీఎఫ్ చిట్టీలను అందజేయడం చాలా సంతోషంగా ఉందని, సీఎంపీఎఫ్ చిట్టీలకు సంబంధించి ఏదైనా సందేహాలు ఉంటే సంబంధిత విభాగాల అధిపతులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం రఘు కుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళి మోహన్, సీనియర్ పీఓ పి కాంతారావు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల కోసం నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

2023-24 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ కళాశాలలో చదువుతున్న షెడ్యూల్డ్ కులములకు చెందిన విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఈ నెల 31వ తేదీలోగా ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నూతన, రెన్యువల్ ఉపకార వేతనాలకు కులం, ఆదాయంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న గత సంవత్సరం ఉపకార వేతనాలకు సంబంధించి దరఖాస్తు ప్రతులను ఈ నెల 23వ తేదీలోగా జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలని, ఆ దిశగా ఆయా కళాశాలల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్‌లో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

30న లోక్ అదాలత్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈ నెల 30వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు, గతంలో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసులను న్యాయవాదులు కక్షిదారులతో సంప్రదించి లోక్ అదాలత్ కార్యక్రమంలో పరిష్కారం చేయడానికి కృషి చేయాలని సిర్పూర్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ అన్నారు. మంగళవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు తమ క్లయింట్లపై పంతాలకు పోకుండా కేసులు రాజీ మార్గంలో పరించాలని సూచించారు. సమావేశంలో సిర్పూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, సీనియర్ న్యాయవాది రైస్ హైమద్, ఎం శంకర్, దయానంద్, శ్రీనివాస్, కళ్యాణ్, గణపతి, అబ్దుల్ మార్తుస్ ఉన్నారు.

కొనసాగుతున్న ఫీవర్ సర్వే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే కొనసాగుతుంది. అందులో భాగంగానే అంకోలి గ్రామంలో మంగళవారం చిన్నపిల్లలకు సర్వే నిర్వహించారు. ఆశా కార్యకర్తలు కవిత, పద్మ జీరో నుంచి



ఐదు సంవత్సరాల పిల్లలకు, రెండు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు నిమోనియా, డెంగ్యూ ఫీవర్, జలుబు, దగ్గు లాంటి వ్యాధులను గుర్తించారు. అలాంటి వ్యాధులు ఉన్నవారు. డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సర్వే అలాంటి లక్షణాలు ఉన్న వారిని ఆశాలు గుర్తించి, ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రానికి చెందిన సచిన్ ఇటీవల అనారోగ్య సమస్యతో మరణించారు. అదేవిధంగా ముధోల్‌కు చెందిన కరుణాకర్ల శంకర్ గుండె పోటుతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు తాటివార్ రమేష్, కోరి పోతన్న, సపటోళ్ల పోతన్న, ధర్మపురి శ్రీనివాస్, దశరత్, కదం సంతోష్ పటేల్, మదన్ మోరే, గంగాధర్ ఉన్నారు.



జిల్లా విద్యార్థికి జాతీయ అవార్డు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలోని కోటపల్లి మండలం అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జిమిడి మని ప్రసాద్ జాతీయ ఇన్స్‌పైర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని జిల్లా పాలనాధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అవార్డు గ్రహీత మని ప్రసాద్, గైడ్ ఉపాధ్యాయుడు సురేందర్‌లను జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత అక్టోబర్ 9, 2023 నుండి 11వ తేదీ వరకు 3 రోజులు ఢిల్లీలో నిర్వహించిన 10వ జాతీయ ఇన్స్‌పైర్ పోటీలలో గైడు ఉపాధ్యాయుడు ఎస్.సురేందర్ శిక్షణలో మని ప్రసాద్ తయారు చేసిన గ్రెన్ ప్రొటెక్టర్ ఫ్రమ్ రెయిన్ అండ్ అనిమల్స్ అంశం జాతీయ అత్యుత్తమ ఇన్స్‌పైర్ అవార్డు కైవసం చేసుకొని జిల్లా ఖ్యాతిని ఉన్నతంగా నిలిపిందని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థి మని ప్రసాద్ న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన అవార్డ్ ప్రధానోత్సవ కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి డాక్టర్ జితేందర్ సింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ డాక్టర్ అభయ్ కరాండీకర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడని, దాదాపు 1000 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో మొత్తం దేశ వ్యాప్తంగా అత్యుత్తమంగా నిలిచిన 60 మందిలో మని ప్రసాద్ నిలవడం అభినందనీయమని అన్నారు. గత 4 నాలుగు సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో మంచిర్యాల జిల్లా విద్యార్థులు రాణిస్తూ జాతీయ అవార్డులు కైవసం చేసుకోవడం సంతోషంగా ఉందని, జిల్లా విద్యార్థులు ఇదే స్ఫూర్తితో మున్ముందు ప్రజా ఉపయోగకర ఆవిష్కరణలు చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, గైడ్ ఉపాధ్యాయుడు సురేందర్, జిమిడి మని ప్రసాద్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని అంకోలి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకోలి గ్రామానికి చెందిన పెందూర్ బాధిరావు(29) గత కొంత కాలంగా మద్యం తాగుడుకు బానిసయ్యాడు. భార్య మహారాష్ట్రకు తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో మోనోసిల్ పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గోవింద్ తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

24న కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పక్కా ఆదిలాబాద్, ఆదిలాబాద్ గాట్ టాలెంట్, సాగర్ సూపర్ మార్కెట్ వారి ఆధ్వర్యంలో కిడ్స్ డ్రాయింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాంపిటీషన్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 23వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 24న ఉదయం 10 గంటలకి ఆదిత్య జూనియర్ కాలేజ్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదని ప్రోగ్రాంలో పాల్గొన్న ప్రతిఒక్కరికి సర్టిఫికెట్ ఇస్తామని పేర్కొన్నారు. అలాగే విజేతలకు షీల్డ్స్ ప్రధానం చేస్తామని తెలిపారు. వివరాలకు 9666697317, 8096726334 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మంగళవారం మండలంలోని రామాయి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయికి చెందిన జట్టే కిషోర్‌కు ఇంట్లో ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు దాదాపు గంట పాటు తీవ్రంగా శ్రమించి మంటలను నీటితో ఆర్పివేశారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో ఫ్రిడ్జ్‌తో పాటు ఇంట్లోని సామాగ్రి, దుస్తులు దగ్ధమైందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కులధృవీకరణ పత్రాలు రద్దు చేయాలి

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని సిరిపెల్లి తండా-1 గ్రామానికి ఏడుగురు వ్యక్తులకు సంబంధించిన కులధృవీకరణ పత్రాలను రద్దు చేయాలని మంగళవారం సిరిపెల్లి తండా-1గ్రామస్తులు తహసీల్దార్ సోముకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిపెల్లి తండా-1కు చెందిన ఏడుగురు రాథోడ్ శ్రీనివాస్, రాథోడ్ సంజు, రాథోడ్ స్నేహ, రాథోడ్ స్వాతి, రాథోడ్ సంజీవ్, విఠల్ రాథోడ్, రాథోడ్ శ్రీధర్ అనే వ్యక్తులు 1977లో ఓటర్ లిస్టులో పేర్లు లేకున్నా వారికి కులధృవీకరణ పత్రాలను జారిచేయడం జరిగిందని పేర్కొన్నారు. కానీ వీరు మహారాష్ట్ర నుంచి వచ్చి, ఇక్కడ నివశిస్తున్నారని తెలిపారు. వీరికి ఇచ్చిన ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో జాదవ్ జీవన్, గ్రామస్తులు ఉన్నారు.

కోరంలేక సర్వసభ్య సమావేశం వాయిదా



నవతెలంగాణ-లక్ష్మణచాంద

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అడ్వాల పద్మరమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి పూర్తి కోరం లేనందున వాయిదా వేసినట్టు ఎంపీడీఓ శేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నప్పటికీ, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో పూర్తి కోరం లేక సమావేశం వాయిదా వేశారు. కొద్ది సేపు అధికారులు వేచి చూసినప్పటికీ ఎవరు హజరు కాకపోవడంతో ఎంపీడీఓ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించాడు. దీంతో అధికారులు వెనుతిరిగారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం నిర్వహించిన మొదటి సర్వ సభ్యసమావేశం కావడంతో మండల నాయకుల చూపు సర్వసభ్య సమావేశంపై ఉన్నప్పటికీ, ప్రజాప్రతినిధులు హజరు కాకపోవడం పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ పరిణామలు ఏటు దారితీస్తాయో త్వరలో తెలనుంది.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఎమ్మెల్యే బొజ్జు పటేల్
- కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో అర్హులైన 183 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ రవాణా సౌకర్యం ప్రకటించామని అన్నారు. ఈ పథకం వలన ఆటో, జీప్, టాటా ఏస్ డ్రైవర్లు, యజమానులు నష్టపోతున్నారని, వారికి కూడా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అలాగే ఆటవి శాఖ ఆంక్షల వలన ప్రజలు, పశు కాపరులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అటవీ శాఖ అంశాల వల్ల కొన్ని గ్రామాలలో చెక్ డ్యామ్‌లు, రోడ్ల నిర్మాణం ఆగిపోయిందని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అటవీశాఖ ఆంక్షలు తొలగించడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో ఆగిపోయిన రోడ్లను పూర్తి చేస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని పార్టీల వారిని కలుపుకొని ముందుకు పోతానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వైస్ ఎంపీపీలు మాదాడి సరోజన, సుతారి వినయ్, జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు రియాజుద్దీన్, రేండ్లగూడ ఎంపీటీసీ దాముక మమతా కరుణాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, పసియుల్లా పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు నీటి సౌకర్యం కల్పించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఒక వ్యక్తి మృతిచెందితే దహనం చేయడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు సాంప్రదాయంగా దహన సంస్కారాలు పూర్తయిన వెంటనే స్నానాలు చేసి వారి ప్రాంతాలకు ప్రయాణం అవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో పట్టణంలో దహన సంస్కారాలకు వచ్చినవారు ఇక్కడ ఎటువంటి స్నానాలు చేయడానికి ఏర్పాట్లు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఓ వార్డు కౌన్సిలర్ అత్త దహన సంస్కరణలకు ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒక కౌన్సిలర్ అయి ఉండి దహన సంస్కరణలకు వాటర్ ట్యాంక్యూ పంపివ్వగలరని మున్సిపల్ అధికారులను కోరగా మా కాడ ఎలాంటి సౌకర్యం లేదని చెప్పడం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చూపెడుతుంది. ఒక కౌన్సిలర్‌కే ఇలా జరిగితే సామాన్య మానవునికి ఎలా అని స్థానిక ప్రజలు ప్రజా ప్రతునిధులు ముక్కున వేలు వేసుకుంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని పలువురు ప్రస్తుత బీఆర్ఎస్ కౌన్సిలర్లు ముచ్చటించుకోవడం గమనార్హం. గ్రామాలలో ఉన్న సౌకర్యాలు, మున్సిపాలిటీలో లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందని అంటున్నారు. దిక్కు లేక మందమర్రి మున్సిపాలిటీ నుంచి వాటర్ ట్యాంక్యూ తీసుకరావడం కొస మెరుపు. గత ప్రభుత్వానికి ఈ విషయంపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా దహన సంస్కారాలకు వచ్చేవారి కోసం సౌకర్యాలను మెరుగుపరిచి స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికలు సిద్ధం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. 21న హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి, కలెక్టర్ల సమావేశం ఉన్నందున, మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, తహసీల్దార్‌లతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నివేదికలను సిద్ధం చేయాలనీ సూచించారు. రైతుబంధు, కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ, కొత్త రేషన్ కార్డులకు అర్హుల అంచనాలు, పెన్షన్ల, మహాలక్ష్మి, గృహాలక్ష్మి వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. గ్రామాల వారీగా ధరణి, భూసమస్యలు, ప్రభుత్వ ప్రయివేటు భూ సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పూర్తీ సమాచారం అందించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి వారం మండలాల వారీగా పెండింగ్ గ్రీవెన్స్‌ల సమీక్ష చేయాలని అన్నారు. దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

భీంపూర్ తహసీల్దార్‌కు నివాళ్లర్పించిన కలెక్టర్...

గుండె పోటుతో సోమవారం మరణించిన భీంపూర్ తహసీల్దార్ జె. నారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యోగరీత్యా అధికారులు వివిధ ప్రాంతాలలో పనిచేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్డీఓలు స్రవంతి, జివాకర్, అధికారులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికల్లో సీఐటీయూని గెలిపించాలి



ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూని గెలిపిస్తే సొంతింటి కల నెరవేరుస్తామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ అన్నారు. సింగరేణి గుర్తింపు ఎన్నికలలో భాగంగా మంగళవారం ఆర్కే-6 ఫిట్ సెక్రటరీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి ఎన్నికలలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)ని గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావలసినటువంటి బకాయిలు అట్లాగే కార్మికుల సొంత ఇంటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం పోరాడేటువంటి సీఐటీయూని గెలిపించాలని కోరారు. రాబోయే కాలంలో కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సింగరేణి బొగ్గు బావులు ప్రయివేటీకరణ అవుతాయని రాష్ట్ర ప్రభుత్వం కూడా దానికి వత్తాసు పలికి అమలు చేస్తుందని విమర్శించారు. సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.29 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో గతంలో ఏఐటీయూసీ ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్లు గెలిచి కార్మికుల కడుపులు కొట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కమిటీ అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి భాగ్యరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ చంద్రశేఖర్, ఆర్కే-6లో సీఐటీయూ నాయకులు ఆవునూరి మహేష్, ఇత్తినేని వెంకటేష్, ఆషాడం రమేష్, సాయి, ప్రకాష్, సుధాకర్, విజయ్ పాల్గొన్నారు.

సింగరేణి ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-నస్పూర్

డిసెంబర్ 23న ప్రగతి స్టేడియంలో నిర్వహించబోయే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, దానికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం రోజున శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు పుర ప్రజలు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ వేడుకలలో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కె.రఘుకుమార్, డీజీఎం పర్సనల్ అరవింద రావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఏరియా వర్క్ షాప్ ఎస్ఈ మల్లయ్య, సివిల్ ఎస్ఈ రాము, సీనియర్ పీఓ పి.కాంతారావు, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ సట్ల అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ తోట సురేష్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

విద్యార్థులు ధ్యానం పట్ల అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-తాండూర్

మానసిక ప్రశాంతత కోసం చేసే ధ్యానం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సింగరేణి సంఘమిత్ర పిరమిడ్ ధ్యాన కేంద్రంమాస్టర్ ఆలేటి లక్ష్మణ్ మాస్టర్ సూచించారు. ధ్యాన జగత్ శాకాహార జగత్ ప్రచారంలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని ఇంక్లైన్ బస్తీకి చెందిన జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ధ్యానం పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం వల్ల ఉత్తమమైన క్రమశిక్షణతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాల వైపు దృష్టి సారించాలన్నారు. ఏకాగ్రతతో ధ్యానం చేయడం వల్ల విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సులువుగా అధిగమించే అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ రోజు వారి భోజనంలో శాఖాహారాన్ని అలవర్చుకోవాలని సూచించారు. శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం, శారీరక తేజస్సు, మేధాశక్తి కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్గి రాజ్యలక్ష్మి విద్యార్థులకు జీవన క్రాంతి పుస్తకాలను పంపిణీ చేశారు.

ఆవులను రక్షించే చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ఆవులను రక్షించేలా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని గోమాత సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు వోటర్కార్ సురేష్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవుల సంరక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నినాదాలు చేశారు. గోమాత సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సంచరిస్తున్న ఆవులను గోశాలకు తరలించి, వాటి సంరక్షణను మున్సిపల్ చేసుకోవాలని తెలిపారు. ఆవులు చనిపోతే అంత్యక్రియల కోసం జేసీబీని అందుబాటులో ఉంచాలని కోరారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ దివాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సంతోష్, రాజేష్, సాయిపృథ్వి, అజయ్, సంతోష్, హేమంత్ పాల్గొన్నారు.

నేడు కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

నవతెలంగాణ - కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్‌పై బుధవారం మెజారిటీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలో మొత్తం 30వార్డులకుగాను 30 మంది కౌన్సిలర్లు ఉండగా మంగళవారం 24 మంది కౌన్సిలర్లు రహస్యంగా సమావేశమై అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసినట్టు తెలుస్తోంది. సంతకాల కాపీని బుధవారం కలెక్టర్‌ను కలిసి అందజేయనున్నట్లు సమాచారం.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పొచ్చెర గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పొచ్చెర గ్రామానికి చెందిన బొగ్గుల విశ్వనాథ్(35) భార్య గత కొన్నెండ్ల కింద విడాకులు తీసుకుంది. అప్పటి నుంచి మద్యం తాగుడుకు బానిసై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుమారుడు, తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ముజాహిద్, రెండో ఎస్సై గోవింద్ తెలిపారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని పొట్టపెల్లి(కె) గ్రామంలో మంగళవారం ఎంపీడీఓ శేఖర్ పర్యటించారు. పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. సాగు నీటి కాలువలు, నర్సరీలలో జరుగుతున్న పనులు పరిశీలన చేసి తగు సూచనలు జారీ చేశారు. నర్సరీలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నసీరుద్దీన్, క్షేత్ర సహాయకులు జెడ్డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ ఉల్వాజీ హైమావతి రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతుందని, పేదలకు వెచ్చధనం కల్పించేలా దాతలు ముందుకు వచ్చి స్వెటర్లు, బ్లాంకెట్స్ పంపిణీ చేయడం అభినందనీయమని బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ ఆధినాథ్ అన్నారు. మంగళవారం పట్టణానికి చెందిన దేవన్న తనకు మనువడు పుట్టడంతో ది బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పేదలకు అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కోఆర్డినేటర్ అధినాథ్ మాట్లాడుతూ చలి కాలంలో చలి తీవ్రత నుంచి రక్షణ పొందేలా స్వెటర్లు, బ్లాంకెట్స్ పంపిణీ చేయడం అబినందనీయమన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని ఆయన ఆకాంక్షించారు. పేదలకు ఆదుకునేలా ఇలాంటి సేవ కార్యక్రమాలను సొసైటీ తరపున మున్ముందు ఇంకా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ ముజహీద్, సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ప్రమోద్, గంగారెడ్డి ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి



నవతెలంగాణ-జైపూర్

విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలని, ఆటల ద్వార మానసికోల్లాసం కలుతుందని అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. మంగళవారం మండల పరిధి ముదిగుంట గ్రామ పంచాయతి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రం ద్వార క్రీడా సామాగ్రి పంపిణి చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమ శిక్షణ కలిగివుండి భవిష్యత్ నిర్మాణం కోసం కష్టపడి చదువడంతో పాటు ఆటపాటల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో మనస్సుకు ఏకాగ్రత లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి సర్పంచ్ దూట జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజగోపాల్, ప్లాంటేషన్ మేనేజర్ జీ.సురేష్ కుమార్, మంచిర్యాల రేంజ్-1 లక్ష్మన్, మంచిర్యాల రేజ్-2 సునిత, బెల్లంపల్లి రేజ్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.